## రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్ష

**భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 1657 మంది హాజరు**


భూపాలపల్లిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సంస్కృతం, తెలుగు, అరబిక్, ఉర్దూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8పరీక్ష కేంద్రాల్లో 1688మంది విద్యార్థులకుగాను 1657మంది విద్యార్థులు హాజరయ్యారని, 31మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ తనిఖీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారని తెలిపారు.

**ములుగులో 47మంది గైర్హాజరు..**

ములుగురూరల్, మార్చి 6 : ములుగు జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 47మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో చంద్రకళ తెలిపారు. 10పరీక్ష కేంద్రాల్లో 1853మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 1806మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పించామన్నారు. ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

## ఆర్‌ఐ నరేశ్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- విచారణ అధికారిగా ఆర్డీవో

రేగొండ, మార్చి 6 : రేగొండ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ అనంతరం ఆర్‌ఐగా పని చేస్తున్న జాపాక నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాహుల్‌శర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై పూర్తి నివేదిక అందించాలని విచారణ అధికారిగా భూపాలపల్లి ఆర్డీవో రవిని నియమించారు. వివరాల్లోకి వెళ్తే.. రేగొండలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నరేశ్, ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన రెడ్డి కులస్తుడికి బీసీ(డీ)గా కుల సర్టిఫికెట్ జారీ చేయడానికి అతని నుంచి డబ్బులు తీసుకుని డీటీ, తహసీల్దార్‌కు తప్పుడు రిపోర్టు ఇచ్చి బీసీ డీ సర్టిఫికెట్ జారీ చేశాడని జనవరి 9న కలెక్టర్‌కు బీసీ సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. అలాగే మండలకేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే ఆ ఇసుకను అప్పగించడంతోపాటు కల్యాణలక్ష్మి, సర్టిఫికెట్లు మంజూరులో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని జనవరి 10న అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ప్రాథమిక విచారణ చేపట్టి ఆర్‌ఐ నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని భూపాలపల్లి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

## మృతుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి నగదు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏటూరునాగారం, మార్చి 6 : మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన కావిరి మధు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు పంపించిన రూ.5వేలు మృతుడి కుటుంబానికి గురువారం అందించినట్లు బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుర్మ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొండగొర్ల తిరుపతి, సోదరి రమేశ్, గట్టు నర్సింహులు, దుర్గ లక్ష్మయ్య, పూతల దిలీప్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, VISLAVATH VIJENDAR S/o. Sakru Nayak, R/o. H.No. 2-3/9, Kasimdevipet Village, Mulugu Mandal, Mulugu Dist. My Daughter name Changed from VISLAVATH PRANVITHA to VISLAVATH PRAKRUTHI for all purposes.

**WANTED**

jobs Apply Now!

★ లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.

NT-329857

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


ప్యూరిఫయర్ మిషన్‌ను అందజేస్తున్న భారత శ్రీనివాస్

### అమృత వర్షిణి వృద్ధాశ్రమానికి వాటర్ ప్యూరిఫైడ్ అందజేత

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలోని అమృత వర్షిణి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం కేటీకే-1 ఇంక్లైన్‌లో సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్న భారత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆత్మీయత సేవా సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేసి, ఆక్వా వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను అందజేశారు. భారత రజిత, శ్రీనివాస్, శ్రీనివాస్ కుమారులు చెర్రీ, సిద్ధు, ఆశ్రమం నిర్వాహకులు కుసుమ శ్యామ్ ప్రసాద్, ఆత్మీయత సేవా సొసైటీ అధ్యక్షులు బయ్యన మహేందర్ పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లపై పట్టింపేది?

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 6 : ఆటో డ్రైవర్ల ఇబ్బందులపై ప్రభుత్వానికి పట్టింపేదని మండలంలోని ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. కాలం గడుస్తున్నా ఆటో డ్రైవర్ల సంక్షేమం మాత్రం కానరాడవం లేదని, 'మహాలక్ష్మి' పథకంతో మండలంలోని ఆటోలకు గిరాకీలు లేక తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ అక్రమ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ఎండీ ఇనాయత్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు వంద రూపాయలు కూడా రాక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇటు ఆటోల కిస్తీ డబ్బులు, అటు పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థంకాక సతమతమవుతున్నామని వాపోయారు. ఆటోలు నడవక, పూట గడవక రోజు రోజుకూ అప్పులపాలై తమ బతుకులు ఆగమవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేసి, ఇచ్చిన హామీలు నెరవేర్చి తమను అన్ని విధాల ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

**Office of the Executive Engineer, TGMSIDC Division, Warangal**
H.No. 2-11-324/1. Beside Govt. CD&TB Hospital, Hanamkonda 506 009.
Phone No. 0870-2455769, Email Id: eetsmsidcwgl@gmail.com

**Tender Notice No. 7/EE/TGMSIDC/WGL/2024-25/, Dated: 06-03-2025**
Tender invited through e-procurement platform for the following works "1) Providing of Street Lights with Poles and Armoured Cable at Area Hospital Bhupalpally in Jayashankar Bhupalpally 2) Repairs and Renovation to PHC Kaleshwaram at at Kaleshwaram in Jayshankar Bhupalapally District (Reserved for SC Category) 3) Purchase and Install (04) body freezer boxes to Government General Hospital Bhupalpally. Two (02) for CHC Mahadevupr and Two (02) for Government Medical College, Jayashankar Bhupalpally 4) Providing 03 No's new Refrigeration Units in place of irrepairable Air Conditioners for the old Central Medicine Stores at Hanamkonda District. The other details can be seen at website https://tender.telangana.gov.in.
Sd/- EXECUTIVE ENGINEER, TGMSIDC DIVISION, Warangal.

# అడవిలో అధికారుల వేట

- 'నమస్తే తెలంగాణ' కథనంతో కదిలిన యంత్రాంగం
- బృందాలుగా ఏర్పడి వన్యప్రాణుల వేటగాళ్ల కోసం గాలింపు


అడవిలో గాలిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

మహదేవపూర్(కాళేశ్వరం),మార్చి 6 : అటవీక్షేత్రాల్లో వన్యప్రాణుల వేటగాళ్ల కోసం అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 5న 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలి' అనే వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు అమర్చే అనవాళ్లను గుర్తించేందుకు అటవీశాఖ యంత్రాంగం అటవిబాట పట్టి విస్తృత గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. గురువారం ఎఫ్‌ఆర్వో రవి ఆధ్వర్యంలో అటవీశాఖ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి మహదేవపూర్ అటవీక్షేత్ర పరిధిలోని మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కుదురుపల్లి, అన్నారం, కాళేశ్వరం, రాపల్లికోట, నస్తూర్‌పల్లితోపాటు పలు అనుమానిత అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టారు. ఈ గాలింపు చర్యల్లో తమకు వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు అమర్చే ఉచ్చులకు సంబంధించిన అనవాళ్లు కనిపించలేదని ఎఫ్‌ఆర్వో తెలిపారు. ఈ అన్వేషణ కొనసాగుతుందన్నారు. వన్యప్రాణులను వేటాడినా, అడవులను ధ్వంసం చేసినా బాధ్యులపై వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### ఇబ్బందులు కలుగకుండా
## ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధ్యక్షతన యాసంగి (రబీ) 2024-25 కాలానికి ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పంట కోత, గన్నీలు, టార్పాలిన్లు, కేలిబర్స్, పాడి క్లీనర్లు సిద్ధం చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు కేంద్రాల్లో పరికరాల లభ్యత, రవాణా సదుపాయాల ఏర్పాటు, అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర అందించే విధానాలు, పంట కోత అనంతరం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసే చర్యలపై సన్నద్ధంగా ఉండాలని అధికారులను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, డీఆర్డీవో నరేశ్, డీసీవో వాలియానాయక్, తూనికలు కొలతల అధికారి శ్రీలత, వ్యవసాయ, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ : కలెక్టర్

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : మార్చి 31వ తేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపులో 25శాతం రాయితీ కల్పించినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్, పట్టణ ప్రణాళిక, పంచాయతీ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించే అంశంపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ సిటిజన్ యాప్ https://lrs.telangana.gov.in నుంచి చెల్లించిన దరఖాస్తుదారులకు మాత్రమే ఫీజు చెల్లింపులో 25శాతం రాయితీ వస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక అధికారి సునీల్, పంచాయతీ కార్యాలయ ఏవో బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా చూడాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లాలోని 11కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లు, 6ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో పరీక్షల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అదనపు కలెక్టర్ విజయలక్ష్మి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకుపోయే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పనిసరిగా ఒక ఉపాధ్యాయుడిని ఎస్కార్ట్‌గా విద్యార్థులతో పంపాలని ఆదేశించారు. దూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్, ఆర్టీసీ, మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి డీఏవోగా వీరూనాయక్

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా వీరూనాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరూనాయక్ గతంలో జనగామ జిల్లాలో డీఏవోగా పనిచేశారు. ఇన్‌చార్జి డీఏవోగా భూపాలపల్లి జిల్లాలో పని చేసిన విజయ్ భాస్కర్ వేరే చోటుకు బదిలీ ప్రయత్నాల్లో ఉన్నారు.

## మహదేవపూర్‌లో గంజాయి పట్టివేత ?

మహదేవపూర్,మార్చి 6 : మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న పలువురిని గురువారం పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓ వ్యక్తి గంజాయి (సుమారు అరకిలో)ని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో మార్చి కారులో స్వయంగా పలువురికి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు మాటు వేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు సదరు వ్యక్తులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. గంజాయి విక్రయంపై ఎవరి ప్రమేయం ఉంది..? ఏ విధంగా రవాణా చేస్తున్నారు? ఎక్కడెక్కడ విక్రయాలు జరిపారు? అనే తదితర అంశాలపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు సమాచారం.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

చిట్యాల, మార్చి 6 : మనస్తాపంతో ఉరేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఒడితల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రబెల్లి విజయ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఎర్రబెల్లి పల్లవి(19) ఉన్నారు. పల్లవి, తల్లి విజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యానికి అయ్యే ఖర్చులు భరించలేక మనస్తాపానికి గురై పల్లవి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. మృతురాలి తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : భూపాలపల్లి పట్టణంలో నివసిస్తున్న సింగరేణి కార్మికుడు జన్నె శంకర్ ద్విచక్ర వాహనంపై హనుమాన్ దేవాలయం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి వైపు వస్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీ ఢీకొనడంతో బైకు పైనుంచి శంకర్ కింద పడగా అతనికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జన్నె శంకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వెంకటాపూర్, మార్చి 6 : నారాయణపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. బుధవారం అర్ధరాత్రి నారాయణపూర్ అడవి నుంచి అక్రమంగా ఇసుకను ట్రాకర్లలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్‌ఆర్వో డోలి శంకర్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. డ్రైవర్లను విచారిస్తున్న క్రమంలో ట్రాక్టర్లను వదిలి పారిపోయారని తెలిపారు. ఇసుక ట్రాకర్లను ములుగు అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి ట్రాక్టర్ల యజమానులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై సతీశ్, అటవీ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీ తగిలి ఒకరికి గాయాలు

ఏటూరునాగారం, మార్చి 6 : మండలంలోని చిన్నబోయినపల్లిలో ట్రాక్టర్ ట్రాలీ తగిలి ఒకరు గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని 3వవార్డుకు చెందిన మంతెన భిక్షపతి భార్య రమాదేవితో కలిసి ములుగు నుంచి ఏటూరునాగారానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నబోయినపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ తగిలింది. దీంతో భిక్షపతి, రమాదేవిలు కిందపడ్డారు. భిక్షపతికి తల, కంటి భాగంలో గాయాలయ్యాయి. వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందించి హనుమకొండకు మెరుగైన వైద్యం కోసం తరలించారు.

## బొలెరో వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

మంగపేట, మార్చి 6 : మండలంలోని చుంచుపల్లి సమీపంలో గురువారం ఓ బొలెరో గూడ్స్ వాహనం ఆటో, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు స్థానిక ఎస్సై సూరి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్లబయ్యారానికి చెందిన దోమల లక్ష్మణ్‌రావు ఆటోలో పాల ప్యాకెట్లు తీసుకొని మంగపేటలో అమ్ముకొని తిరిగి వెళ్తున్నాడు. చుంచుపల్లి సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. కొంత దూరం వెళ్లాక మరో ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న లక్ష్మణ్‌రావుతోపాటు, బైక్‌పై ఉన్న నవీన్, వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలెరో వాహన డ్రైవర్ రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మహిళలు చైతన్యవంతులు కావాలి

ములుగురూరల్, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులై ఎదగాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కురెందుల సమ్మక్క పిలుపునిచ్చారు. గురువారం ములుగులో నిర్వహించిన శ్రామిక మహిళా జిల్లా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, సరిత, రమ, నిర్మల, కవిత, నసీమా, సమ్మక్క, రోజారాణి, శ్రీకల, శారదదేవి, సీతారత్నం, నాగమణి, అమృత, సావిత్రి పాల్గొన్నారు.

## భక్తులకు వైద్య సేవలు అందించాలి

రేగొండ, మార్చి 6 : లక్ష్మీనరసింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జయశంకర్ జిల్లా వైద్య అధికారి మధుసూదన్ హెచ్చరించారు. మండలంలోని కొడవటంచ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 9నుంచి 16వరకు జాతర బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో గురువారం రేగొండ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో రేగొండ వైద్యాధికారి హిమాబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామప్ప చెరువులోకి దేవాదుల నీరు

వెంకటాపూర్, మార్చి 6 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప చెరువులోకి దేవాదుల నీటిని అధికారులు బుధవారం సాయంత్రం విడుదల చేశారు. గత కొన్ని రోజులుగా నీటి సరఫరాను నిలిపివేసిన అధికారులు మళ్లీ బుధవారం సరఫరాను ప్రారంభించారు. రామప్ప చెరువు నుంచి రంగరావుపల్లి పంపుహౌస్ ద్వారా నీటిని పాఖాల సరస్సులోకి, రంగాయ చెరువుకు, గణపసముద్రంకు కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అవసరం మేరకు నీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## హామీలను అమలు చేయాలని సీఎంకు పోస్టు

ములుగురూరల్, మార్చి 6 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాసి తపాలా బాక్స్‌లో వేశారు. ఉద్యమకారులకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు, రూ.2500 పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. పోస్టుకార్డులు పంపించిన వారిలో ద్రోణాచారి, మాచర్ల ప్రభాకర్, రాజేశ్వర్‌రావు, హరినాథ్, బోయిని రవి, రేనుకుంట్ల సురేశ్, చీదర సంతోశ్, లింబాద్రి, మనోహర స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రాజమొగిలి, చందా చక్రపాణి ఉన్నారు.

## మిషన్ భగీరథ పంపు హౌస్‌ను పరిశీలించిన డీఈఈ

వాజేడు, మార్చి 6 : మండలంలోని ధర్మవరం గ్రామశివారులోని మిషన్ భగీరథ పంపు హౌస్‌ను గురువారం విద్యుత్‌శాఖ ములుగు జిల్లా డీఈ పులసం నాగేశ్వరావు స్థానిక విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. వేసవికాలం నేపథ్యంలో మిషన్ భగీరథ పంపుహౌస్ ద్వారా గ్రామాలకు తాగునీటి సరఫరాకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ హర్షద్ అహ్మద్, ఏఎల్ఎంలు రమేశ్, రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

వెంకటాపురం(నూగూరు), మార్చి 6 : మక్కజొన్న పంట వేసి నష్టపోయిన తమకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా యోగితానగర్ నుంచి మండలకేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌పీ నాయకుడు సాయి, వెంకటాపురం, వాజేడు రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చిట్యాల మార్చి 6 : మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామంలో గురువారం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. చెల్పూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడితో లక్ష్మీపూర్‌తండా గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికకు పెళ్లి చేస్తున్నారనే సమాచారం మేరకు చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూశాఖ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లినట్లు తెలిపారు. వివాహం జరిగే ప్రదేశానికి వెళ్లి ఇరువురి కుటుంబ సభ్యులకు బాల్యవివాహం వల్ల కలిగే అనర్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. బాలికకు వివాహ వయస్సు రాకుండా పెళ్లి చేయొద్దని సూచించినట్లు తెలిపారు. అనంతరం మైనర్ బాలికను బాల సదన్‌కు తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి, కళావతి, సాయిరాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుల్ లింగన్న, నాగరాజు పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రణాళిక

ఏటూరునాగారం, మార్చి 6 : ఈ వేసవిలో ఏజెన్సీ మండలాల్లో అత్యవసర సేవలు అందించే కార్యాలయాలు, ప్రాంతాలకు నిరంతరం విద్యుత్ అందించడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ డీఈఈ పులుసం నాగేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల, మిషన్ భగీరథ కేంద్రాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు అవసరం లేని సమయంలో కరెంటు వాడకుండా ఆదా చేయాలని కోరారు. ఆయన వెంట ఏడీ సుధాకర్, ఏఈఈ అశోక్ పాల్గొన్నారు.

## అది పులికాదు.. పునగ పిల్లి

**ఫారెస్టు అధికారుల నిర్ధారణ**

రేగొండ, మార్చి 6 : గోరికొత్తపల్లి మండల పరిధిలోని బొక్కచెరువు సమీపంలో బుధవారం సంచరించింది పులికాదు పునగ పిల్లి అని చెల్పూరు ఎఫ్‌ఆర్వో నరేశ్ తెలిపారు. గోరికొత్తపల్లి మండలం బొక్కి చెరువు పరసర ప్రాంతాల్లో బుధవారం పులి సంచరించిందనే ప్రచారం మేరకు గురువారం ఉదయం ఫారెస్టు అధికారుల బృందం ఆ ప్రాంతంలో పాద ముద్రలను పరిశీలించింది. పాదముద్రలు పులివి కాదని, పునగ పిల్లివిగా అధికారులు గుర్తించారు. ప్రజలు ఎలాంటి భయందోళనకు గురికావద్దని, వ్యవసాయ పనులకు నిర్భయంగా వెళ్లవచ్చని తెలిపారు. ఫారెస్టు సెక్షన్ అధికారి గౌతమి ఉన్నారు.

## ఆలయంలో రేకుల షెడ్డు నిర్మాణానికి విరాళం

గణపురం, మార్చి 6 : మండల కేంద్రంలోని పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణానికి గురువారం జలాశయ బోర్‌వెల్స్ నిర్వాహకులు తొలుపునూరి భరణి ధనరాజ్ దంపతులు తమవంతుగా రూ.10,116లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధనకు విరాళంగా అందజేశారు. అర్చకులు ముసునూరి నరేశ్ భరణిధనరాజ్ దంపతులకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మూల శ్రీనివాస్‌గౌడ్, బండారు శంకర్, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, పాండవుల భద్రయ్య, మాదాసు మొగిలి, బటిక స్వామి పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఫైలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు**


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు

భూపాలపల్లి రూరల్, మార్చి 6 : ఆన్‌లైన్ ఫైలింగ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పీ నారాయణబాబు అన్నారు. గురువారం నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్‌లో కేసులను ఎలా ఫైల్ చేయాలి అనే అంశాలపై భూపాలపల్లి జిల్లా కోర్టులో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణబాబు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లిటరసీ అనేది చాలా ముఖ్యమని, కేసుల ఈ ఫైలింగ్ విధానం తెలిసినప్పుడు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా కేసులను వేసుకునే వీలుంటుందని తెలిపారు. దీని ద్వారా విలువైన సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. రిసోర్స్ పర్సన్లు అఖిల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలు పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెరుగు రవీందర్, స్పెషల్ పీపీ ఎన్ విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

## మిర్చి పంటకు మద్దతు ధర ప్రకటించాలి


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

వెంకటాపురం(నూగూరు), మార్చి 6 : కేంద్ర ప్రభుత్వం మిర్చి పంటకు చట్ట బద్ధత కల్పించి క్వింటా మిర్చి పంటను రూ.25వేల కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన మిర్చి రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ములుగు ప్రాంతం మిర్చి పంటకు ప్రసిద్ధి గాంచిందని అన్నారు. గత రెండేళ్లుగా మిర్చి రైతులు తీవ్రమైన నష్టాలు చవి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పంటల్లో మిర్చి పంటను కేంద్ర ప్రభుత్వం చేర్చలేదని, వెంటనే ఆ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పొగాకు, పసుపు బోర్డు వలే రాష్ట్రంలో మిర్చి బోర్డును కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. రైతు సంఘం, సీపీఎం నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు, చిట్టెం ఆదినారాయణ, ఎండీ గఫూర్, జ్ఞానం వాసు, దావూద్, చారి పాల్గొన్నారు.

## ఇన్ స్పైర్ అవార్డుకు ఎంపికైన మాచర్ల ఆశ్రిత


ఆశ్రితను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ మారుతి

కృష్ణ కాలనీ, మార్చి 6 : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఇన్ స్పైర్ అవార్డుకు భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి పాఠశాలకు చెందిన మాచర్ల ఆశ్రిత ఎంపికైంది. భూపాలపల్లి సింగరేణి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కుమారి మాచర్ల ఆశ్రిత కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ అవార్డును సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ కే మారుతి కలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అవార్డుతోపాటు రూ.10వేలు నగదుతో సత్కరించింది. ఆశ్రితను సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏ రాజేశ్వరరెడ్డి, ఎడ్యుకేషన్ సెక్రెటరీ జీ శ్రీనివాస్ అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ మారుతి, హెచ్ఎం సీహెచ్ ఝాన్సి ఆశ్రితకు పుష్పగుచ్ఛంతో అభినందించి ఓ విలువైన పుస్తకాన్ని బహూకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గద్దెలకు చేరిన వనదేవతలు


వనదేవలను గద్దెలకు చేర్చుతున్న దేవరబాల, వడ్డెల బృందం


మంగపేట, మార్చి 6 : మండలంలోని మల్లూరు శివారు మామిడిగూడెంలో మూడు రోజులుగా జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా గురువారం సాయంత్రం గుట్ట మీద నుంచి సమ్మక్క, సారలమ్మ గద్దెల పైకి చేరారు. వనదేవతలను డోలి వాయిద్యాలు, గిరిజన నృత్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. నేడు (శుక్రవారం) మొక్కు చెల్లింపులుంటాయని దేవరబాల, వడ్డె తెలిపారు. వేడుకల్లో దేవర బాల పూనెం జనార్దన్, వడ్డె రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, మారబోయిన గోవర్ధన్, పూజారులు, దేవర కర్రలు ఆడించే వారు, గిరిజన కులపెద్దలు పాల్గొన్నారు.

## రోడ్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

టేకుమట్ల, మార్చి 6 : టేకుమట్ల మండలంలో కలికోట-పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామాల మధ్యలోని మానేరు వాగులో ఉన్న మట్టి రోడ్డును తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్యమాదిగ కోరారు. వాగులో ధ్వంసం చేసిన రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానేరు వాగులో కొందరు అక్రమంగా రోడ్డు నిర్మాణం చేసి టోల్ టాక్సీ వసూలు చేస్తున్న విషయంపై గత కొన్ని రోజులుగా పత్రికల్లో వార్తకథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు టోల్ టాక్స్ వసూలు చేయకుండా చర్యలు తీసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని సదరు వ్యక్తులు కక్ష పూరితంగా మట్టి రోడ్డును జేసీబీల సహాయంతో ధ్వంసం చేయడం దారుణమన్నారు. రోడ్డును ధ్వంసం చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డును ధ్వంసం చేసిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావులు స్పందించి మళ్లీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రయాణికుల సమస్యను తీర్చాలని ఆయన కోరారు.

## సమీపిస్తున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**జాతర ఏర్పాట్లు శూన్యం**


లక్ష్మీనరసింహస్వామి ఆలయం

రేగొండ. మార్చి 6 : తెలంగాణలో రెండో యాదాద్రిగా పేరుగాంచిన మండలంలోని కొడవటంచ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9నుంచి 16వరకు జరుగనున్నాయి. ఈ క్రమంలో జరిగే జాతరకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం చలవ పందిళ్లు, ఆవాసం ఉండటానికి నీడ, వాహనాల పార్కింగ్, విద్యుత్, తాగునీటి వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న ఆనవాళ్లు కనిపించడం లేదు. కాళేశ్వరం ఈవోకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో వారంలో ఏదో ఒక రోజు మాత్రమే వస్తుండటంతో పర్యవేక్షణ కరువైందనే వాదనలు వినిపిస్తున్నాయి. అర్చకులు కూడా సమయపాలన పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆలయ పాలకవర్గం ప్రేక్షక పాత్ర వహిస్తున్నట్లు బాహాటంగానే చర్చ జరుగుతున్నది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో చేపట్టాల్సిన ప్రచారం కానీ, వాల్ పోస్టర్లు కానీ కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్వామి వారి ఆదాయానికి గండి పడే అవకాశాలు ఉన్నాయని భక్తులు అంటున్నారు. కాగా, జాతర ఏర్పాట్లపై ఈవో వివరణ కోసం 'నమస్తే తెలంగాణ' ప్రయత్నం చేయగా ఆయన ఆలయంలో లేక పోవడమే కాకుండా ఫోన్‌లో కూడా స్పందించలేదు.